పర్యవేక్షిస్తేనే.. నాణ్యమైన భోజనం!

సర్కారు బడుల్లో ఆహార కమిటీలపై కసరత్తు

పురుగులున్న బియ్యంతో వంట చేయకుండా చర్యలు

నాసిరకం కూరగాయలు, సరుకులపై కట్టుదిట్టం

ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం పై ప్రత్యేక దృష్టి

సాక్షి,సిటీబ్యూరో: మెనూ బాగున్నా అమలులో కష్టాలు తప్పడం లేదు. నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా గిట్టుబాటు కాక విద్యార్థులకు నాసిరకం భోజనమే గతవుతోంది. ఇటీవల రాష్ట్రంలోని విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అంతటా యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు జిల్లాల్లోని ప్రభుత్వ బడుల్లో తగిన పర్యవేక్షణకు మండల నోడల్ అధికారులను నియమించారు. వీరు రోజూ మండలాల్లోని బడుల్లో పర్యవేక్షణ చేస్తే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా మెలిగే అవకాశం ఉంటుంది.

అమ్మ ఆదర్శ కమిటీల పాత్ర కీలకమే..

అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పడి 11 నెలలు కావస్తోంది. వీరి పాత్ర పాఠశాల నిర్వహణలో నామమాత్రమైంది. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో కమిటీ సభ్యుల పర్యవేక్షణ అవసరం. వసతుల కల్పనపై ఆదర్శ కమిటీలు నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యా నిపుణులు చెబుతున్నారు. వంట చేసే వేళ శుభ్రతపై దృష్టి పెట్టాలని పేర్కొంటున్నారు.

ఆహార కమిటీల పాత్ర అంతంతే!

పాఠశాలలో వండిన భోజనాన్ని ముందుగా ఇద్దరు ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదట పరిశీలించాలి. ప్రధానోపాధ్యాయులు కూడా వంటల రుచి చూడాల్సి ఉంటోంది. వీరు భోజనం రుచి చూశాకే మిగతా విద్యార్థులకు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటోంది. వంట పాత్రలు ఎలా ఉన్నాయో సరి చూడాలి.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొంతకాలంగా అనేక బడుల్లో ఆహార కమిటీల పాత్ర అంతంతమాత్రంగానే ఉంటోంది.

నిధులు పెంచితేనే సత్ఫలితాలు

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఏళ్ల నాటి నుంచి ధరలు పెరగడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు చాలీచాలని నిధులతో అరకొరగా భోజనం వండి విద్యార్థులకు సమకూరుస్తున్నారు. పైగా నెలల తరబడి బకాయి బిల్లులు చెల్లింపులకు నోచుకోక ఏజెన్సీ నిర్వాహకులు వంట తయారీపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. నిధులు పెంచితేనే పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే వీలుంటోంది. ఈ విషయమై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఈఓ విజయకుమారి స్పందిస్తూ.. ఇప్పటికే బడుల్లో మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పెంచామన్నారు. ఇటీవల నియమితులైన మండల నోడల్ అధికారులకు రోజూ తనిఖీలు చేసేలా చూస్తున్నామన్నారు.

505 పాఠశాలలు.. 87500 మంది విద్యార్థులు

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలో 2,437 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలల్లో 87,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జిగా నియమించారు. రోజుకు ఎంత మంది హాజరవుతున్నారు? ఎంతమంది భోజనం చేస్తున్నారు? కోడిగుడ్డు పెడుతున్నారా? రాగిజావ, మెను అమలవుతుందా? తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అయితే చాలా చోట్ల పథకాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. నాణ్యత లేకున్నా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతను గాలికొదిలేస్తున్నారు. దీంతో నాణ్యత లోపించి పిల్లలు అస్వస్థతకు గురవుతున్నారు.

నాణ్యత పెంచేందుకు పకడ్బందీ చర్యలు



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఆహార కమిటీల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హెచ్చరిస్తున్నాం. మండల నోడల్ అధికారులు తరచూ సందర్శించి భోజనాన్ని తనిఖీ చేస్తున్నారు.

– విజయకుమారి, మేడ్చల్–మల్కాజిగిరి డీఈఓ

విద్యార్థులు కూడా సభ్యులే

మధ్యాహ్న భోజన పథకం అమలులో ఆహార కమిటీ సభ్యులే కీలకంగా వ్యవహరించనున్నారు. నాణ్యతపై పర్యవేక్షణకు వారికి పూర్తి బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రతి బడిలో ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు, తరగతికొక విద్యార్థి కమిటీలో సభ్యులుగా ఉంటారు. నాసిరకమైన సరకులు వినియోగిస్తే తిరస్కరిస్తారు. శుభ్రతపై దిశానిర్దేశం చేస్తారు. భోజనానికి ముందు రుచి, నాణ్యతను కమిటీ సభ్యులు చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డిస్తారు.

కమ్యూనిస్టు నాయకుడు కృష్ణగౌడ్ మృతి



రంగారెడ్డినగర్: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, గిరినగర్ బస్తీ వ్యవస్థాపకుల్లో ముఖ్యుడు అలగోని కృష్ణగౌడ్ మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్లు పి.నరసయ్య, వంగాల చంద్రమ్మ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వంగాల శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బస్తీ వాసులు కృష్ణగౌడ్ మృతదేహంపై పూలమాలేసి నివాళి అర్పించారు. వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించిన కృష్ణగౌడ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. సాయంత్రం గుబురుగుట్ట శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వాసులు

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్ పుష్పగిరి బస్తీలో నల్ల పోచమ్మ పునర్‌ప్రతిష్ట 41 రోజులు గడిచిన సందర్భంగా ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ హేమలత ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యురాలు దివ్యశ్రీగౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరెడ్డి

నిజాంపేట్: సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం బాచుపల్లి సాయికృష్ణజా హిల్స్‌లో జరిగిన కాలనీ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని, స్థానికంగా ఏ సమస్య నెలకొన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, తిరుపతి, వెంకటేశ్వర్లు, జనార్దన్‌రెడ్డి, విజయ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న ఉప కమిషనర్ నరసింహ

సుభాష్‌నగర్: సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై 120 మంది దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ సంఘం అధ్యక్షుడు అంజయ్య గౌడ్, సభ్యులు నరేందర్‌రెడ్డి, యాదయ్య, సత్యం, శేఖర్ గౌడ్, రాజ్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి చౌరస్తాలో ఆదివారం అల్వాల్ ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొంపెల్లి చౌరస్తాలో హెల్మెట్‌లు ధరించని ద్విచక్ర వాహనదారులు, రాంగ్‌రూట్, త్రిబుల్ రైడింగ్, లైసెన్స్‌లు లేని వాహనదారులను గుర్తించి జరిమానా విధించారు. పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి పట్టుబడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి వదిలిపెట్టారు.

నేడు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

- ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

దుండిగల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మున్సిపాలిటీలోని గండిమైసమ్మలో పార్టీ జిల్లా కార్యాలయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించనున్నారు. ఆదివారం నియోజకవర్గ స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు పాల్గొనే విధంగా చూసుకోవాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరుగకుండా వాలంటీర్లు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రారంభోత్సవ ఏర్పాట్లను, సభాస్థలి, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. గాజులరామారం డివిజన్ బాలాజీ లేఅవుట్ చౌరస్తాలో ఉదయం 10.30 గంటలకు జరిగే వేడుకలకు నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి హాజరు కానున్నారు. వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ముఖ్య నాయకులు కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చింతల్: తెలంగాణ కాంగ్రెస్ ప్రజాపాలన సంబరాలలో భాగంగా ఆదివారం ఓల్డ్ చింతల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పండరి, నాయకులు జేమ్స్, బాల్‌రెడ్డి, రఘు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యువనేత కార్తీక్‌రెడ్డికి ఘన నివాళి



దొంతిరి కార్తీక్‌రెడ్డి (ఫైల్)

సుభాష్‌నగర్: బీఆర్‌ఎస్ యువజన నేత దొంతిరి కార్తీక్ రెడ్డి అకాల మరణంతో సుభాష్ నగర్ డివిజన్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్తీక్‌రెడ్డి అంతిమయాత్ర శనివారం సాయంత్రం అశ్రునయనాల మధ్య కొంపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద, డీసీపీ కోటిరెడ్డితో పాటు ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్తీక్‌రెడ్డి విద్యార్థి దశ నుండే సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనేవారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పైచదువుల నిమిత్తం ఆర్థిక సాయం, వందమందికి పైగా పేద పెళ్లి కూతుర్లకు పుస్తె, మెట్టెలు పంపిణీ చేశారు.

నియామకం

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు రాష్ట్ర మహిళా పరస్పర వినియోగదారుల సహకార సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా ఆల్విన్‌కాలనీకి చెందిన పర్వత సంధ్యారాణి సతీష్ కుమార్ పటేల్ ఎన్నికయ్యారు. ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం రావుల సమక్షంలో రాష్ట్రం మొత్తం 33 జిల్లాలకు 33 మంది డైరెక్టర్లను ప్రకటించారు. ఆల్విన్‌కాలనీకి చెందిన పర్వత సంధ్యారాణి సతీష్ కుమార్ పటేల్‌ను రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు.



ఘనంగా గీతా జయంతి మహోత్సవం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో గీతా జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గీతా పరివార్ నిర్దేశంతో డాక్టర్ ఎం.ఆర్.ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భగవద్గీత, కృష్ణ పూజ, భగవద్గీతా శ్లోకాల సామూహిక పారాయణంతో పాటు చిన్నారులకు క్విజ్, రంగులు పూరించే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదే విధంగా భగవద్గీతా శ్లోకాలను కంఠస్థం చేసిన వారిని సత్కరించారు. గీతా పరివార్ దక్షిణాంచల్ ప్రముఖ్ హరినారాయణ్ వ్యాస్ ముఖ్య అతిథిగా, ఆర్‌ఎస్‌ఎస్ ధర్మ జాగరణ ప్రముఖ్ అచ్యుత మురహరి ముఖ్య వక్తగా హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టాభి రామాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ చల్లా సుధీర్ రెడ్డి, బేతి రాజారెడ్డి, ఉప్పల సత్యనారాయణ, మైలారం అశోక్, రామాంజనేయులు, శేఖర్, రవి వర్మ, మంతెన హరిత, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాము నిర్మాణానికి శంకుస్థాపన



గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కొత్తకుర్మ సత్తయ్య, నరేందర్‌రాజు తదితరులు

సుభాష్‌నగర్: దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో గండిమైసమ్మలో రూ.3 కోట్ల నిధులతో చేపడుతున్న గోదాము నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొత్తకురుమ సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. నాబార్డు నిధులతో కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో గోదాము నిర్మాణం జరుగుతోందని, ఇది పూర్తయితే రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకుని, డిమాండ్‌ను బట్టి విక్రయాలు చేపట్టే అవకాశముంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సీఈవో తీగల కృష్ణ, డైరెక్టర్లు చింతల మధుసూదన్, బూర్గుబావి సత్యనారాయణ, మల్లేష్, కృష్ణ, నరేందర్, చింతల శ్రీనివాస్, మధుసూదన్, మైసిగరి మదన్‌రావు, అక్కినబోయిన సత్యనారాయణ, సగిడి సావిత్రి, పీఏసీఎస్ భౌరంపేట్ చైర్మన్ బాల్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లిలోని కెన్నడి హై ద గ్లోబెల్ స్కూల్ 20వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. అంకురా ఆసుపత్రి పెడియాట్రిక్ సర్జన్ డాక్టర్ వీ.వీ.ఎస్.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సుబ్బారెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.సుబ్బారెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– నిజాంపేట్

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

దుండిగల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం భౌరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ధర్మాగ్రహ దీక్షలో భాగంగా ఈనెల 17న జరిగే ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పెండింగ్ బిల్స్, ఉపాధ్యాయులకు రావల్సిన నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గడప నవీన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మోడీ గారి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉప్పరి సురేందర్, గోపాల్, వెంకటరమణ, వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధి నందమూరి నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. కాలనీ వాసులకు, పరిసర ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో రక్త పరీక్షలు, జనరల్, దంత వైద్యం, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్‌టీ వంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎండీ ఇబ్రహీం, అష్రాఫ్, యాసిన్, సదా మహేష్, జుబేదా బేగం, విమల, స్వప్న, బిజన్, పర్వీన్ బేగం, సంగన్న, మహ్మద్ ఖురేషి, వైద్య సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లోని నందనవనం కాలనీలో నెలకొన్న సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రధాన రోడ్డు, అంతర్గత రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, పార్కులో సైతం అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో కాలనీలో వాటర్ ట్యాంక్ ఉన్న ప్రదేశంలో కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడి భవనాలు నిర్మించారని, వీటిని నిరోధించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిజాంపేట అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, ప్రగతి నగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, నాయకులు శివప్రసాద్, శ్రీనివాస్ గుప్తా, సచిన్, సంతోష్, నారాయణమూర్తి, కాశీ, శివకుమార్ గుప్తా, సుమన్‌రావు, గజ్జల సంతోష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ జేఏసీ కమిటీ ఎన్నిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో జేఏసీ కమిటీ సమావేశంలో ఆదివారం రాష్ట్ర కమిటీని రద్దు చేశారు. నూతన రాష్ట్ర కమిటీ, అనుబంధ యూనివర్సిటీ కమిటీలు వేయాలని తీర్మానం చేశారు. చైర్మన్‌గా బొట్ల బిక్షపతికి జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర కమిటీ, యూనివర్సిటీల నియామక బాధ్యతలను అప్పగించారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కమిటీ అధ్యక్షుడిగా ఆదిమల్ల పవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా అభిరామ్, తేజ, జనరల్ సెక్రటరీలుగా ప్రణయ్, సుకాంత్, వేణు, ప్రభాస్, వైస్ ప్రెసిడెంట్‌లుగా హర్ష, సాయి తేజ, రాకేష్, లోకేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నర్సింహ, సిద్దార్థ, సాత్విక్, తిరు, సెక్రటరీలుగా ప్రవీణ్, శివ, విక్రాంత్, ప్రశాంత్, లోకేష్, వాజిద్, సోషల్ మీడియా శ్రవణ్, సాయిభరవిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బల్లగ్ సందీప్, అంబటి తేజ, దాస్యం విక్రాంత్ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు, డాక్టర్ అందె సుధాకర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: అనాథలు, కళ్లు లేని వారికి, వితంతువులు, వృద్ధులకు సేవ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట మోడల్ మార్కెట్ సమీపంలో కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ అధ్యక్షుడు డాక్టర్ అందె సుధాకర్ ఆధ్వర్యంలో 200 మందికి రగ్గులు, చీరలు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ సంస్థను స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సేవ చేయడం సంతోషకరమన్నారు. అందె సుధాకర్‌కు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్ అందె సుధాకర్ మాట్లాడుతూ..తాము మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, తూము శ్రావణ్‌కుమార్ నాయకులు కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, పోచయ్య, యాదగిరి, హరినాథ్ కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ సభ్యులు సంజీవ, సురేష్, మనీష్, ప్రేమ్‌కుమార్, మహేష్, విజయ్, రాజు, శ్రీను, లక్ష్మణ్, కవిత, జ్యోతి, స్నేహలత, మేరీ, లక్ష్మి పాల్గొన్నారు.